# పట్నం.. పల్లెకు పయనం







**సొంతూళ్లకు తెలంగాణ ప్రజలు**

సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణ ప్రజలు పట్నం నుంచి పల్లెకు పయనమయ్యారు. తమ సొంతూళ్లకు కుటుంబ సభ్యులతో కలిసి బయలుదేరారు. దీంతో జేబీఎస్, ఎంజీబీఎస్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఉప్పల్ క్రాస్ రోడ్డు, ఎల్బీనగర్ చౌరస్తాలు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. రోడ్లపై వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది.















## పరేడ్ గ్రౌండ్‌లో కైట్ ఫెస్టివల్

**పరిసరాలలో ట్రాఫిక్ ఆంక్షలు**

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో 13వ తేదీ నుంచి 15 వరకు ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ పెస్టివల్ నిర్వహిస్తుండటంతో పరేడ్‌గ్రౌండ్ పరిసరాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే తెలిపారు. ఈ సందర్భంగా గ్రౌండ్ పరిసరాలలో ట్రాఫిక్ మళ్లింపు అప్పటి పరిస్థితులను బట్టి ఉంటుందని వెల్లడించారు. పరేడ్ గ్రౌండ్ 1వ, ఈస్ట్ గేట్‌లను సాధారణ పబ్లిక్ ఎంట్రీ కోసం వాడుకోవాలని సూచించారు. వాహనాలు పరేడ్‌గ్రౌండ్ ఈస్ట్, వెస్ట్‌గేట్ కుడిపక్కన(వీఐపీ), కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్, జింఖానా గ్రౌండ్, బైసన్ పోలో గ్రౌండ్‌లలో పార్కింగ్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో చుట్టుపక్కల ఉన్న ట్రాఫిక్ జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీ ఉంటుందని, ప్రత్యామ్నాయ రూట్లలో వాహనదారులు ప్రయాణించి ఇబ్బందులు లేకుండా తమ గమ్య స్థానాలకు చేరుకోవాలని సూచించారు.


**కిక్కిరిసిన రహదారులు...**

సంక్రాంతికి హైదరాబాద్ నుంచి తమ సొంత ఊర్లకు వెళ్లే వారితో జాతీయ రహదారులు కిక్కిరిస్తున్నాయి. శనివారం విపరీతమైన రద్దీ ఉండగా ఆదివారం మధ్యాహ్నం వరకు కూడా అదే విధంగా సాగింది. ఈ నేపథ్యంలోనే నగరం నుంచి బయటకు వెళ్లే వాహనాలతో బెంగుళూర్, ముంబై, విజయవాడ, వరంగల్, రాజీవ్ రహదారి, నిజామాబాద్ రహదారులు వాహనాలతో నిండిపోయాయి. ఎక్కువగా బెంగుళూర్, విజయవాడ రహదారులలో వాహనాలు కన్పించాయి. విజయవాడ రహదారిలోని చౌటుప్పల్‌లోని పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనాలు వేగంగా వెళ్లేలా రాచకొండ పోలీసులు చర్యలు తీసుకున్నారు.

# ఆత్మగౌరవ సౌధాలు డబుల్ బెడ్రూంలు

- డబుల్ బెడ్రూంలను అందించిన ఘనత కేసీఆర్‌దే
- దుండిగల్‌లో ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్ ,జనవరి 12: ఇరుకిరుకు గదులు కాకుండా విశాలవంతమైన రెండు పడకల గదులతో ఇండ్లను నిర్మించి నిరుపేదల ఆత్మగౌరవాన్ని పెంచే విధంగా డబుల్ బెడ్రూంలను అందించిన ఘనత బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కే దక్కిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌తో పాటు దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి కృష్ణ, కౌన్సిలర్, బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణతో పాటు తదితరులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నిరుపేదలు ఆత్మగౌరవంతో బతకాలనే సంకల్పంతో పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లను అందించిన మహానేత కేసీఆర్ అని గుర్తు చేశారు. డబుల్ బెడ్రూంల సముదాయాలకు బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కుల కృష్ణయాదవ్, గోపాల్‌రెడ్డి, శంభీపూర్ కృష్ణ, జక్కుల విజయ శ్రీనివాస్‌యాదవ్, ఆనంద్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, చిత్రంలో దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి

## నిజాం ప్రభుత్వంలో దళితులకు పెద్దపీట


సమావేశంలో మాట్లాడుతున్న రౌనక్ యార్ ఖాన్

ఖైరతాబాద్, జనవరి 12 : నిజాం ప్రభుత్వం దళిత వర్గాల సంక్షేమానికి ఎనలేని కృషి చేసిందని నిజాం వారసుడు నవాబ్ రౌనక్ యార్ ఖాన్ అన్నారు. దళిత, ముస్లిం, క్రిస్టియన్ ఆర్గనైజేషన్స్, దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రౌనక్ యార్‌ఖాన్ మాట్లాడుతూ నిజాం పాలనలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని, ముఖ్యంగా దళితులకు పెద్దపీట వేయడంతో పాటు వారికి తగిన గుర్తింపునిచ్చారన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు 1953 జనవరి 12న గౌరవ డాక్టరేట్ అందించారని గుర్తు చేశారు. నాటి నుంచి జనవరి 12ను నేషనల్ స్కాలర్స్ డేగా వేడుకలు జరుపుతున్నారన్నారు. ప్రొఫెసర్ భంగ్యా బూక్య, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి


బహుమతి అందజేస్తున్న జబర్దస్త్ ఆర్టిస్ట్ రాకింగ్ రాకేశ్, సీఐ నర్సింహరాజు

బాలానగర్, జనవరి 12 : సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం తమ బాధ్యత అని జబర్దస్త్ ఆర్టిస్ట్ రాకింగ్ రాకేశ్ (కేసీఆర్ సినిమా నటుడు)అన్నారు. ఆదివారం బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాలానగర్ కనకదుర్గ ఆలయం ఎదురుగా గల రోడ్డులో సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఆయనతో పాటు బాలానగర్ సీఐ నర్సింహరాజు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని మన్నె శ్రీలత ముదిరాజ్ కైవసం చేసుకున్నారు. మరో ఇద్దరికి బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ భావి తరాలకు సంస్కృతి, సంప్రదాయాలను అందించడం కోసం ఇలాంటి వేడుకలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మందడి శ్రీనివాస్‌రెడ్డి, పంజా రాంచందర్, ఖాజా, నర్రా దేవేందర్‌రెడ్డి, సభాపతిరెడ్డి, కుమార్, మల్లారెడ్డి, కవితతో పాటు బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

## మాతృభాషను ప్రేమిద్దాం.. ప్రకృతిని కాపాడుదాం

శంషాబాద్ రూరల్, జనవరి 12 : భారతీయ సంస్కృతి పునరుజ్జీవనానికి కృషి చేద్దామని మాతృభాషను ప్రేమించడంతో పాటు ప్రకృతిని కాపాడుతామని మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు సూచించారు. స్వర్ణభారతిట్రస్ట్‌లో ఏర్పాటు చేసిన సంక్రాంతి వేడుకలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి పునరుజ్జీవనానికి కృషి చేద్దామన్నారు. దీంతో పాటు మాతృభాషను ప్రేమించి ప్రకృతిని కాపాడుదామని పిలుపునిచ్చారు. మన మాలలను ఎప్పుడు మరచిపోకూడదని వివరించారు. సంక్రాంతి వేడుకలు జరుపుకొని ప్రజలందరూ సంతోషంగా ఉండాలని సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో జరుపుకునే సంక్రాంతి గొప్ప పండుగ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణభారతి ట్రస్టు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.


గంగిరెద్దుల వద్ద సందడి చేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

## కరోటిడ్ ఆర్డరీ డిసెక్షన్ ఆపరేషన్ విజయవంతం


రోగితో కలిసి వివరాలు వెల్లడిస్తున్న కేర్ దవాఖాన న్యూరాలజిస్టు డాక్టర్ కైలాశ్‌మిర్చి

శేరిలింగంపల్లి, జనవరి 12: ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న 29 సంవత్సరాల యువకుడికి 20 నిముషాల్లో కరోటిడ్ ఆర్డరీ డిసెక్షన్ విధానం ద్వారా ఆపరేషన్ నిర్వహించి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడి కేర్ హాస్పిటల్ వైద్యులు పునఃర్జన్మ ప్రసాదించారు. అతి క్లిష్టమైన వాస్కులర్ ఇబ్బందులను ఈ శస్త్రచికిత్సతో తొలగించినట్లు కేర్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. నగరానికి చెందిన రాకేశ్‌గుప్తా కొంతకాలంగా మెడనొప్పి, వాంతులతో పాటు తీవ్రమైన గుండెనొప్పితో బాధపడుతూ గచ్చిబౌలిలోని కేర్ హాస్పిటల్‌లో చేరారు. ప్రముఖ సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ కైలాశ్‌మిర్చి నేతృత్వంలో వైద్యపరీక్షలు నిర్వహించిన కేర్ వైద్యులు రాకేశ్‌గుప్తా కరోటిడ్ ఆర్డరీ డిసెక్షన్‌తో అతడు ప్రాణాపాయస్థితిలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే త్రింబోలిసిస్ వైద్య ప్రక్రియను ప్రారంభించి పూర్తిచేశారు. రోగి గుండెకు సరైన రక్త సరఫరాను పునరుద్ధరించడానికి త్రింబోలిసిస్ (క్లాట్ లైజింగ్ ఏజెంట్ ప్రక్రియ) ద్వారా మెరుగైన చికిత్సను అందించినట్లు కేర్ వైద్యులు డాక్టర్ కైలాశ్‌మిర్చి తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణను అడ్డుకునే యత్నం


అభివాదం చేస్తున్న మందకృష్ణ, సూర్యారావు, విఠల్ తదితరులు

ఖైరతాబాద్, జనవరి 12 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ వర్గీకరణ పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని వక్తలు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా జాతీయ ఎంబీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన మందకృష్ణ మాట్లాడుతూ 30 ఏండ్ల సుధీర్ఘ పోరాటంలో వర్గీకరణ అంశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కలిసి వచ్చిన రాజకీయ పార్టీల మద్దతు కోరానన్నారు. ఓ వర్గం వర్గీకరణను అడ్డుకునే ప్రయత్నం చేస్తుందని, వారి వల్లనే ఆ ఫలాలు పొందలేకపోతున్నామన్నారు. బీసీ, ఎస్టీ వర్గాలు మాత్రం మద్దతునిస్తున్నాయన్నారు. బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు మాట్లాడుతూ 30 ఏండ్ల పాటు ఒక అంశం కోసం పోరాడటం గొప్ప విషయమని, ఎంబీసీల హక్కుల కోసం మందకృష్ణ ఎంతో అండగా నిలిచారని, వర్గీకరణకు బాసటగా నిలబడటం తమ బాధ్యత అన్నారు. తెలంగాణ విఠల్, తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఫిబ్రవరి 7న నిర్వహించే వెయ్యి గొంతుకలు, లక్ష డప్పుల కార్యక్రమానికి సంఘీభావంగా బీసీ, ఎంబీసీలోని అన్ని కులాల వారు తమ తమ వృత్తుల నమూనాలను ప్రదర్శనకు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఎంబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బంగారు నరసింహ సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేందర్, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్, ఓర్సు కృష్ణయ్య, దరువు ఎల్లన్న, శంకర్, లక్ష్మణ్, గోవింద్ నరేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అపజయాలకు కుంగిపోవొద్దు


రామకృష్ణ మఠ్‌లో నిర్వహించిన యువజన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్/కవాడిగూడ జనవరి 12(నమస్తే తెలంగాణ): అపజయాలకు కుంగిపోవొద్దని.. మీలో ఉన్న శక్తిని గుర్తించి ఆత్మవిశ్వాసంతో అడుగు ముందుకేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు యువతకు పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద బోధనలను స్ఫూర్తిగా తీసుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయన సూచించారు. ఆదివారం దోమల్‌గూడలోని రామకృష్ణ మఠ్‌లో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై యువతకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నేటి తరం యువత చిన్న చిన్న సమస్యలకే కుంగిపోతున్నది. ఒక అపజయం ఎదురైతే చాలు.. మా వల్ల ఏదీ కాదేమోననే నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లే ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటన్నింటిని ఎదుర్కొని ముందుకు సాగితేనే విజయం దక్కుతుందని తెలుసుకోవాలి. యువత తలుచుకుంటే సాధించలేనిదంటూ ఏదీ లేదు' అని అన్నారు. 'మీ ఆలోచన తీరే మిమ్మల్ని విజయం వైపు నడిపిస్తుంది. మీ తల్లిదండ్రులు, గురువులు.. ఇలా ఎవరో ఒకరు వచ్చి చేయి పట్టి నడిపిస్తారనే భావన నుంచి బయటకు రండి. మీ జీవితాన్ని మీరే తీర్చిదిద్దుకోవాలి.'యువతను జాగృతం చేసి సన్మార్గం వైపు నడిపించేందుకు రామకృష్ణ మఠ్ చేస్తున్నకృషి అభినందనీయం. యువతలో జాతీయ భావాన్ని పెంపొందిస్తూ.. వారిలో దాగి ఉన్న శక్తిని వెలికి తీస్తుంది. నేను చదువునే రోజుల్లో ఇక్కడికి అనేక సార్లు వచ్చాను.. ఉమ్మడి ఏపీలో మంత్రిగా ఉన్నప్పుడు వచ్చాను.. ఇప్పుడు వచ్చాను.. ఇక్కడికొచ్చిన ప్రతిసారి నాలో ఒక పాజిటివ్ ఎనర్జీ వస్తుంది..ఆ ఎనర్జీ నన్ను నా లక్ష్యం వైపుకు నడిపిస్తుంది' అని మంత్రి వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ తమిళ మ్యాగజైన్ 'తుగ్లక్' మ్యాగజైన్ ఎడిటర్ గురుమూర్తి, రామకృష్ణ మఠ్ అధ్యక్షుడు స్వామి బోధమయానందా జీ తదితరులు పాల్గొన్నారు.

# ఆ జీవోను వెంటనే రద్దుచేయాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ

రవీంద్రభారతి,జనవరి12: తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులకు ఈ నెల 8న ప్రభుత్వం నుంచి విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సారథిలో ఉద్యోగ ధర్మం నిర్వహిస్తున్న కళాకారుల స్వేచ్ఛను హరించే విధంగా సర్క్యులర్ జారీచేశారని అప్రజాస్వామికంగా ఉన్న దానిని ఉపసంహరించుకోవాలని కోరారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఆ సర్క్యులర్ గురించి సీఎం రేవంత్‌రెడ్డికి, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు తెలిసివచ్చినట్లు అనుకోవడంలేదన్నారు. దీని వెనుక డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క నిర్ణయం ఉందని భావిస్తున్నానని ఆయన వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ శక్తులు కాంగ్రెస్ పార్టీలో బలంగా ఉండటం వలన బహిరంగంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల రూపంగా ఉండే మాల సామాజిక వర్గం వాళ్లే వర్గీకరణకు వ్యతిరేక చర్యలు చేపడుతున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించడం అంటే కాంగ్రెస్ పార్టీని శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి మాటలను ధిక్కరించడమేనన్నారు. కాంగ్రెస్ పార్టీలో రెండో స్థానంలో ఉన్న మల్లు భట్టి విక్రమార్క ఈ కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. గద్దర్ కుమార్తె వెన్నెలను సారధి చైర్మన్‌గా నియమించడంలో భట్టివిక్రమార్క పాత్ర చాలా బలంగా ఉందన్నారు. వెన్నెల అప్రజాస్వామికమైన సర్క్యులర్‌ను జారీ చేయడం సరికాదన్నారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుడు దరువు ఎల్లన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్, ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమ నేత నలిగంటి శరత్‌మాదిగ, ఇస్మాయిల్, పాటల రచయిత మాట్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హైదరాబాద్, ఆట ప్రతినిధి జనవరి 12 : తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ నూతన ప్రధాన కార్యదర్శిగా చాతిరి బాబురావు, అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్ఆర్.ప్రేమ్‌రాజ్, ఉపాధ్యక్షుడిగా మల్కా కొమరయ్య, సంయుక్త కార్యదర్శిగా రవి నాయక్, కోశాధికారిగా శివ శంకర్, కార్యవర్గ సభ్యులుగా అర్జున అవార్డు గ్రహీత జేజే.శోభ, జగన్నాథ్ స్వామి, కల్పన రెడ్డి, నాగమణి, సంతోష్ సాగర్ ఎన్నికైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కిరణ్ ప్రకటించారు.